



నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఏడు వారాల వెంకన్నగా పిలుచుకునే.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. 18వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. ఈ మేరకు ఆలయం వద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

6

బదిలీ టైమ్..

రాజమహేంద్రవరం/చింతూరు/కాకినాడ కలెక్టరేట్/కాకినాడ కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నలుగురు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. వీరిలో ముగ్గురిని ఇక్కడికిక్కడే సర్దుబాటు చేసే శారు. కాకినాడ జేసీ రాహుల్ మీనా రాజమహేం ద్రవరం కమిషనర్‌గా నియమితులయ్యారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కాకినాడ జేసీగా నియమితులయ్యారు.రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు చింతూరు బాధ్యతలు అప్పగించారు. కాకినాడ కమిషనర్ భావన బాపట్ల జేసీగా బదిలీ అయ్యారు.

రాజమండ్రి కమిషనర్‌గా మీనా



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాహుల్ మీనా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.రాహుల్ మీనా ప్రస్తుతం కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా ఏడాది పాటు పనిచేశారు. అంతకుముందు ఈయన మార్కాపురం సబ్ కలెక్టర్‌గా కూడా విధులు నిర్వహించారు.రాజమ హేంద్రవరం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్ కీర్తి చేకూరి ఉన్నారు.

కాకినాడ జేసీగా అపూర్వ భరత్



చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భరత్ 2024 ఆగస్టు 30న చింతూరు ఐటీడీఏ సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించారు.ఈ ఏడాది ఆగస్టు 25న శిక్షణ నిమిత్తం ఆయన డెహ్రాడూన్‌కు వెళ్లారు. నవంబరు 25న శిక్షణ పూర్తి కానుంది. భరత్ లక్నోలో గౌతమ్ బుద్ధ టెక్నికల్ యూనివర్శిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేశారు.

కాకినాడ కమిషనర్ భావన బదిలీ



కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం జీవో నెంబర్ 1844 విడుదల చేసింది. 2024 జూలైలో కాకినాడ కమిషనర్‌గా భావన బాధ్యతలు బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా భావన బదిలీ అయ్యారు.

చింతూరు సబ్ కలెక్టర్‌గా శుభం నొక్వాల్



రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌కు చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్) బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో ప్రస్తుతం శుభం నొక్వాల్ సబ్ కలెక్టర్,ఐటీడీఏ పీవోగా కొనసాగుతారు.

మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా..



ఉప్పాడ సభలో మాట్లాడుతున్న పవన్

ఇదే నా ఆన!

ఉప్పాడ సభలో డిప్యూటీ సీఎం పవన్

- వంద రోజులు గడువు ఇవ్వండి
- పారిశ్రామిక కాలుష్యంపై ఆడిట్
- మత్స్యకారుల ఆవేదనకు బాధపడ్డా
- అందుకే మీ ముందుకు వచ్చా
- మీకు న్యాయం చేస్తా
- పవన్ హామీతో ఆనందం

(కాకినాడ,యు.కొత్తపల్లి,పిఠాపురం-ఆంధ్రజ్యోతి) మత్స్యకారుల సమస్యలను వంద రోజుల్లో పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు.పిఠాపురం నియోజకర్గం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో పవన్‌కల్యాణ్ గురువారం సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగించారు. సముద్రంలో కలుస్తున్న పారిశ్రామిక వ్యర్థ జలాలు ఏ మేరకు ఉన్నాయనే దానిపై ఆడిట్ చేయడానికే వంద రోజుల గడువు అని తెలిపారు. నాలుగు రోజులు ధర్నా చేస్తే ఐదో రోజే పరిష్కారం అవదని.. మ త్స్యకారులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేను మీలో ఒకడిని..

తాను డిప్యూటీ సీఎం..పిఠాపురం ఎమ్మెల్యేను కాదని..మత్స్యకారుల్లో ఒకడినని పవన్ సభలో పేర్కొనడంతో చప్పట్లు మార్మోగాయి.మత్స్యకారులంటే నాకు అభిమానం, ప్రేమ. మిమ్మల్ని ఎగదోసి పబ్బం గడుపుకునే నాయకులను మాత్రం నమ్మవద్దన్నారు.ఉప్పాడ కొత్తపల్లి మండలంలో మత్స్యకారులు కొంతకాలం కిందట నాలుగు రోజులు ధర్నాలు, ఆందోళనలు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.మత్స్య సంపద అంతరించిపోతుందనే వారి ఆవేదన తనకు బాధ కలిగించిందన్నారు.అందుకే సమస్య పరిష్కారానికి ఏం చేయాలనేదానిపై అధికారులు, అన్ని పార్టీలు, మత్స్యకార సంఘాల నాయకులతో కలెక్టరేట్‌లో గురువారం ఉదయం సమావేశమై చర్చించినట్టు వివరించారు. ఆరోగ్యం బాగోలేక వెంటనే రాలేకపోయానని..ఈ నెల 10న వస్తానని చెప్పినా ప్రజల కోసం ఒకరోజు ముందుగానే వచ్చానన్నారు. మత్స్య కార సంఘాల నేతలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పవన్ కల్యాణ్ సభలో ఒక్కొక్కటిగా వివరించారు. నక్కపల్లి,కాకినాడ సెజ్‌లు, దివీస్, అరబిందో, డెక్కన్ తదితర పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంవల్ల వేట దొరకడం లేదని మత్స్యకారులు తెలిపారని, ఇవి కాంగ్రెస్ ప్రభు త్వంలో వచ్చాయన్నారు.ఈ కాలుష్యం ఏ స్థాయిలో ఉందనేది మత్స్యకా రులు తనకు వివరించారని..అందుకే మూడు రోజుల్లో కాకినాడ పోర్టు నుంచి సముద్రంలోకి వెళ్లి కాలుష్యం జాడలను పరిష్కరిస్తానని పవన్ హామీ ఇచ్చారు.అమీనాబాద్ హార్బర్ డిజైన్ లోపం వల్ల పడవలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్న విషయమై సమస్య పరిష్కరిస్తామన్నారు. స్థానికంగా మత్స్యసంపద దొరకనప్పుడు అంత ర్వేది, మచిలీపట్టణం, నిజాంపట్నం తదితర ప్రాంతాలకు వేటకు వెళ్తే ఇబ్బంది పెడుతున్నారన్న విషయమై ఇప్పటికే మంత్రి కొల్లు రవీంద్ర,రాజోలు ఎమ్మెల్యేతో చర్చించగా, సమస్య పరిష్కారమైందన్నారు.ఇక నుంచి ఉప్పాడ మత్స్యకా రులు వేటకు అటువైపు వెళ్ల వచ్చని ప్రకటించారు.రింగుల వలలు వాడొద్ద న్నారు. ఎన్ని ఇబ్బందులు పడినా ఉప్పాడ రక్షణ గోడ నిర్మించడం తథ్యం అన్నారు. ఉప్పాడ-కోనపాప పేట తీర ప్రాంతంలో రూ.5.72 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నామన్నారు. పది రోజుల కోసారి డిప్యూటీ సీఎం కార్యాలయం, కూటమి నాయకులు ద్వారా ఎప్పటికప్పుడు జరుగుతున్న విషయాలను తెలియజేస్తారన్నారు.



చూడండి సార్ : పవన్‌తో మాజీ ఎమ్మెల్యే వర్మ

పర్యటన సాగిందిలా..

ఉదయం 10:30 గంటలకు పవన్ హెలీకాప్టర్‌లో కాకినాడ పోలీసు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు.అక్కడి నుంచి 11.30 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం 2.30 గంటలకు జీఆర్టీ హోటల్‌కు చేరుకుని పార్టీ నేతలతో ముచ్చటించారు. సాయంత్రం ఉప్పాడలో సభ ముగించుకుని హెలీకాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని తిరిగి వెళ్లారు.



కలెక్టరేట్‌లో మత్స్యకార సమస్యలపై చర్చిస్తున్న పవన్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎంపీ ఉదయ్ తదితరులు



ఉప్పాడ శివారులో హెలిప్యాడ్ వద్ద వర్షంలో తడిచి ముద్దైన కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, ఇతర అధికారులు

తడిచి ముద్దయ్యారు

- వర్షంలో పూర్తిగా తడిచిన కలెక్టర్, ఎస్పీ

పిఠాపురం,అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):జిల్లా అధికారులంతా తడిచి ముద్దయ్యారు. జోరున వర్షం కురుస్తున్నా కదలకుండా అక్కడే ఉండిపోయారు. ఈ దృశ్యం కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారులో హెలిప్యాడ్ వద్ద గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉప్పాడ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. అప్పటివరకూ బాగానే ఉన్న వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమైంది. డిప్యూటీ సీఎం సభాస్థలి నుంచి ఉప్పాడ శివారులోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్ ఎక్కే సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో పవన్‌కు వీడ్కోలు చెప్పేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందు మాధవ్‌తోపాటు అధికారులందరూ తడిచి ముద్దయ్యారు. జోరున వర్షం కురుస్తున్నా అక్కడి నుంచి కదలలేదు. హెలికాప్టర్ టేకాఫ్ తర్వాతే వారు అక్కడి నుంచి బయలుదేరారు.

కాన్వాయ్ ఆపి.. సమస్యను చెప్పి..

కాకినాడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్లో ఉప్పాడ మత్స్యకారులతో సమావేశం ముగించుకుని జీఆర్టీ గ్రాండ్‌కు బయల్దేరిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాన్వాయ్‌ను కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన రత్నావతి అనే మహిళ అకస్మాత్తుగా అడ్డుకుంది. జడ్పీ సెంటర్ సమీపంలోని దుకాణ సముదాయాల వద్ద పవన్ వాహనానికి అడ్డుగా వెళ్లింది. వెంటనే స్పందించిన పవన్‌కల్యాణ్ కారును ఆపాలని సూచించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేసినా.. ఆమె నేరుగా డిప్యూటీ సీఎం పవన్ వద్దకు వెళ్లి తన సమస్య వినతిని అందజేసింది. 2016లో సునీల్‌కుమార్‌తో తనకు ప్రేమ వివాహమైందని, ఐదేళ్లుగా అతడు ఎక్కడఉన్నాడో తెలియడంలేదని తెలిపింది. వినతిని తీసుకుని సమస్యను పరిష్కరించాలని పవన్ అధికారుల్ని ఆదేశించారు.



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న పవన్

హెలికాప్టర్ ద్వారా హార్బర్ పరిశీలన

పిఠాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ సముద్ర తీరప్రాంతాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హెలికాప్టర్ ద్వారా గురువారం సాయంత్రం పరిశీలించారు. ఉప్పాడ సమీపంలో నిర్మితమవుతున్న హార్బర్ డిజైన్‌లో లోపం ఉందని మత్స్యకార సంఘాల ప్రతినిధులు కాకినాడలో జరిగిన సమావేశంలో పవన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఉప్పాడకు హెలికాప్టర్‌లో వస్తున్న సమయంలో హార్బర్‌ను పరిశీలించారు.



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఘనస్వాగతం

- కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యేల ఆహ్వానం
- కట్టుదిట్టమైన భద్రత మధ్య పర్యటన

కాకినాడ/కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన జిల్లాలో గురువారం కట్టుదిట్టమైన భద్రత నడుమ సాగింది. జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. కాకినాడ ఎస్పీ గ్రౌండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న పవన్‌కల్యాణ్‌కు కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ ఘనస్వాగతం పలికారు. అనంతరం కాకినాడ కలెక్టరేట్లో ఉప్పాడ ప్రాంత మత్స్యకార ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన 'మాట-మంతి' కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాణసంచా తయారీ సంస్థల్లో విస్తృతంగా తనిఖీలు



వేట్లపాలెంలో తనిఖీలు నిర్వహిస్తున్న తహశీల్దార్లు

- ఒక సంస్థ మూసివేతకు ఆదేశాలు

సామర్లకోట,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలంలోని ఐదుబాణసంచా తయారీ సంస్థలను స్థానిక తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, పెదపూడి తహశీల్దార్ పీవీ సీతాపతిరావు తదితర రెవెన్యూ అధికారుల సమక్షంలో గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సామర్లకోట పట్టణ శివారుకు చెందిన తాతపూడి చిన్నీకి చెందిన బాబా ఫైర్ వర్క్స్ తయారీ సంస్థ రెన్యువల్ కాలేదని, కార్మికులకు బీమా సదుపాయాలు లేవని, ఎన్‌వోసీ గడువు ముగిసిందని గుర్తించి సదరు సంస్థను మూసివేయాలని నిర్వాహకులను తహశీల్దార్లు హెచ్చరించారు. అంతకుముందు హుస్సేన్‌పురం, వేట్లపాలెం, జి.మేడపాడు కెనాల్‌రోడ్డులోని ఐదు బాణసంచా తయారీ యూనిట్లను తనిఖీలు నిర్వహించగా అప్పటికే అన్ని సంస్థల్లో బాణసంచా తయారీ కార్యకలాపాలు లేక వెలవెలబోయినట్లు అధికారులు గుర్తించారు హుస్సేన్‌పురంలో బాణసంచా సామాగ్రి విక్రయించుకునేందుకు శాశ్వత లైసెన్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శివకాశీనుంచి దిగుమతులు చేసుకున్న బాణసంచా సామాగ్రిని పరిశీలించి భద్రతా ఏర్పాట్లు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో వీఆర్వోలు మామిడాల కామరాజు, పసలపూడి కొండలరావు, ఫైర్‌మాన్ మహ్మద్‌యాకూబ్, రాఘవ, మండా వెంకటసుబ్బారావు, తయారీదారులు గుండేపల్లి అబ్బన్న, కొసనా హరిబాబు,కొసనా బాబ్జీ, గుంటముక్కల సత్యనారాయణ, అడబాలనాని, వల్లూరి రాంబాబు,సతీష్ పాల్గొన్నారు.

ఖరీఫ్ వరికోతలు ప్రారంభం

- ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సన్నద్ధం
- ఖరీఫ్‌లో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఆశించినస్థాయిలోనే ఖరీఫ్ వరికోతలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ప్రథమంగా గండేపల్లి మండలంలో వరికోతలు జరుగుతున్నాయి. వరిలో ప్రైవేటు హైబ్రిడ్ రకాలు విత్తనాలు నాటిన రైతులకు పంటలు చేతికి వస్తున్నాయి. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2.14లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. జూన్ మొదటి వారంనుంచి కాలువలకు నీటిని విడుదల చేయడంతో సాగు ఆరంభమైంది. కొన్ని మండలాల్లో వరినాట్లు వేయగా కొన్నిచోట్ల వెదజల్లే పద్ధతిలో సాగుచేశారు. ఆగస్టు నెలలో వచ్చిన తుపాన్ల వల్ల 3వేల ఎకరాల్లో వరి పంట నష్టపోయింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో రెండోసారి విత్తనాలు ఉచితంగా పంపిణీ చేసి నాట్లు వేయించారు. తొలుత సాగు చేసిన మండలాల్లో వరిపంట ఏపుగా పెరిగింది. ప్రధానంగా గండేపల్లి మండలంలోని తాళ్లూరు, మురారి గ్రామాల్లో వరికోతలు రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ మండలంలో 120 నుంచి 135 రోజుల్లో పంటలు చేతికి వచ్చే ప్రైవేటు హైబ్రిడ్(ఫైన్ వెరైటీలు) వరిలో సాగుచేశారు. దీంతో అక్టోబరు తొలివారంలోనే పంటలు చేతికొచ్చాయి. ఎంటీయూ 7029, ఎంటీయూ 1318 రకాలు సాగు చేసిన పెదపూడి, సామర్లకోట, జి.మేడపాడు, పెద్దబ్రహ్మదేవం, వేట్లపాలెం వంటి ప్రాంతాల్లో నవంబరు మొదటివారంలో వరిలో కోతలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా వరిపంటలో ఎలాంటి చీడపీడలు లేకపోవడంవల్ల ఆశించినస్థాయిలో దిగుబడులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 6లక్షల3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతేడాది ఖరీఫ్‌లో 5.30లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది దానికంటే ఎక్కువగా దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలకు నిత్యం వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచనలు ఇస్తున్నారు.

ధాన్యం సేకరణకు సన్నాహాలు

జిల్లాలో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో సన్నాహాలుచేస్తున్నారు. జిల్లాలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోఉన్న అధికారులు, రైతు సేవా కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి ఇప్పటికే జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయిల్లో ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ధాన్యం సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అతి త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

ఖరీఫ్ కోతలు శుభపరిణామం

వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

జిల్లాలో ఖరీఫ్‌లో వరి కోతలు ప్రారంభం అవ్వడం శుభపరిణామంగా భావిస్తున్నాను. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరిలో అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతులు సకాలంలో వరినాట్లు వేయడంతోపాటు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల దిగుబడులు ఎక్కువగా వచ్చేలా పంటలు కనిపిస్తున్నాయి. దిగుబడిని అంచనా వేయడానికీ, పంట నాణ్యతను విశ్లేషించడానికి వరికోత ప్రయోగాలు జరుగుతున్నాయి.

పొగాకు వినియోగంతో క్యాన్సర్ ఉత్పన్నం

- డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):పొగాకు వినియోగంతో మానవ దేహంలో అనేక క్యాన్సర్‌లు ఉత్పన్నమవుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. జాతీయ పొగాకు నివారణ మహోత్సవాలు,మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్‌ఆధ్వర్యంలో గురువారం ర్యాలీతోపాటు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానం, ఖైనీ, గుట్కా నమలడంవల్ల ఊపిరితిత్తుల్లోని గొట్టాలు కుచించుకుపోయి క్యాన్సర్‌కు దారి తీస్తుందన్నారు. అందువల్ల పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలని సూచించారు. రోజుకు కనీసం 8 గంటల నిద్ర, 30 నిమిషాల వ్యాయామం, యోగ, ప్రాణాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ, డీపీఎంవో డాక్టర్ లక్ష్మి, మలేరియా అధికారి డాక్టర్ విల్సన్ పాల్గొన్నారు.

ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుని కర్ణాటక సంగీతం, అన్నమాచార్య కీర్తనల ద్వారా దేశ, విదేశాల్లో ప్రాచుర్యం పొందిన ఆయన చేసిన కచేరీలు, ఆలపించిన కీర్తనలు కళాభిమానుల చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అన్నమాచార్యుల కృతులకు బాణీలు కట్టి, కర్ణాటక సంగీతానికి వన్నెలద్దిన 'సంగీత కళానిధి', ప్రముఖ సంగీత విద్వాంసుడు నేదునూరి కృష్ణమూర్తి జయంతి శుక్రవారం జరగనున్నది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యే కథనం.



సంగీత కళానిధి నేదునూరి

కర్ణాటక సంగీతానికి వన్నెలద్దారు
అన్నమాచార్యుల కృతులకు బాణీలు.. నేడు కృష్ణమూర్తి జయంతి

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పిఠాపురం మహారాజా ఎస్టేట్‌లో పనిచేసిన నేదునూరి శ్రీరామమూర్తిపంతులు-విజయలక్ష్మి దంపతులకు కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10వ తేదీన జన్మించారు. (ఈయన కొత్తపల్లిలో జన్మించినప్పటికీ పిఠాపురాన్ని జన్మస్థలంగా చెబుతారు) తన తల్లి, మేనమామ ద్వారా సం గీతంపై ఆసక్తి పెంచుకున్న ఆయన 1940లోనే విజయనగరంలోని మహారాజా మ్యూజికల్ కళాశాలలో వయొలిన్, సంగీతం నేర్చుకున్నారు. తొలుత ద్వారం నరసింగరావునాయుడు వద్ద, తదనంతరం పద్మభూషణ్ శ్రీపాద పినాకపాణి ద్వారా సంగీతాన్ని పూర్తిగా అవపోశన పట్టారు. ఆల్ ఇండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా గుర్తింపు పొందారు. 1945లో 18 ఏళ్ల వయసులోనే పలు సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. 1950 వరకు పిఠాపురంలోనే నివసించిన ఈయన తర్వాత ఇక్కడి నుంచి వెళ్లి విశాఖపట్నంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఆయన మద్రాసు మ్యూజిక్ అకాడమీలో ఐదు దశాబ్దాలకు పైగా సంగీత కచేరీలు నిర్వహించారు. తదనంతరం కంచికామకోటి పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గమ్మవారి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా పనిచేశారు.



పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని సందర్శించిన నేదునూరి కృష్ణమూర్తి (ఫైల్ ఫొటో)

ఒక్క కీర్తనకే సంగీత కళానిధి ఇవ్వొచ్చు

నానాటి బతుకు నాటకము... అన్నమాచార్య కీర్తనకు నేదునూరి కృష్ణమూర్తి కట్టిన బాణీని ఆలకించిన ప్రముఖ గాయకురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి ఈ ఒక్క పాటకు బాణీ కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వవచ్చు అంటూ చేసిన ప్రశంస నేదునూరి ప్రతిభకు అద్దంపట్టింది. దేశ, విదేశాల్లో నేదునూరి చేసిన అన్నమాచార్య సంకీర్తనలు మంచి ప్రాచుర్యం పొందాయి. అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టారు. వీటితో పాటు ఆయన స్వరపరిచిన కీర్తనల్లో దాశరథి శతకం పద్యాలు, రాగసుధారస, భద్రాచల రామదాసు కీర్తనలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఆల్ ఇండియా రేడియో భక్తిరంజని కార్యక్రమంలో ఈయన రూపొందించిన నారాయణ తీర్థ తరంగాలు, రామదాసు కీర్తనలు అలరించాయి. ఇవన్నీ సీడీలు, క్యాసెట్ల రూపంలో ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి.

వివిధ హోదాల్లో...

నేదునూరి తొలుత విజయవాడ జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రధాన అధ్యాపకుడిగాను, తదనందరం సికింద్రాబాద్, విజయనగరం, తిరుపతి సంగీత కళాశాలల్లో పనిచేశారు. వెంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్ విభాగం డీన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ఆల్‌ఇండియా రేడియో సంగీత విభాగం ఆడిషన్ బోర్డు సభ్యుడిగా వ్యవహరించారు. కొంతకాలం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గౌరవ ఆచార్యుడిగా ఉన్నారు. తాను వయొలిన్, సంగీతం నేర్చుకున్న విజయనగరం కళాశాలలోనే పనిచేయడం తనకు అత్యంత సంతృప్తి ఇచ్చిందని నేదునూరి చెప్పేవారు.

పురస్కారాల వెల్లువ

నేదునూరికి పలు పురస్కారాలు లభించాయి. 1976లో చెన్నైలోని శ్రీకృష్ణ గానసభ 'సంగీత చూడామణి' అవార్డుతో తొలుత సత్కరించింది. మద్రాసు మ్యూజిక్ అకాడమీ 1991లో 'సంగీత కళానిధి' పురస్కారంతో, 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళానీరాజన' పురస్కారంతో, చికాగోలోని నార్త్ అమెరికా అన్నమాచార్య ప్రాజెక్టు 'అన్నమాచార్య విద్వన్మణి, రాష్ట్ర సాంస్కృతిక సమాఖ్య 1999లో హంస అవార్డుతో సత్కరించాయి. 2002లో రాజ్యలక్ష్మి ఫౌండేషన్ ద్వారా రాజ్యలక్ష్మి అవార్డు, 2002లో అభ్యుదయ ఫౌండేషన్ ఛైర్మన్ బాదం మాధవరావు ద్వారా బాదం అప్పారావు మెమోరియల్ ట్రస్టు అవార్డు, 2010లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ పొందారు. అనారోగ్యానికి గురయ్యే వరకు ఆయన కీర్తనలను ఆలపించడమే కాదు స్వరపరుస్తూనే ఉన్నారు. 87 ఏళ్ల వయసులో 2014 డిసెంబరు 8న విశాఖపట్టణంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణించినా ఆ సుస్వరాలు నేటికీ అందరినోటా వినిపిస్తూనే ఉన్నాయి.

జన్మభూమిపై ఎనలేని మమకారం

నేదునూరి ఎక్కడకు వెళ్లినా పిఠాపురంపై మాత్రం మమకారం వీడలేదు. తనకు జన్మనిచ్చిన గడ్డపై అడుగుపెట్టేందుకు ఆయన తరచూ ప్రయత్నించేవారు. నేదునూరి కృష్ణమూర్తి చిన్నతనంలో ఈయన కుటుంబం పిఠాపురంలోని కోటవారి వీధిలో ఎక్కువ కాలం నివాసముంది. తదనంతరం ఆకొండివారి వీధిలో ఉన్నారు. ఇప్పుడు వారు నివసించిన గృహాలు శిథిలమవ్వడంతో అక్కడ నూతన గృహాలు వెలిశాయి. అయినప్పటికీ ఆ వీధుల్లో నివసించే వృద్ధుల్లో పలువురికి నేదునూరితో అవినాభావ సంబంధాలు ఉండేవి.

పాదగయపై భక్తి భావం.. జన్మ స్థలం అమ్మఒడి

జీవితచరమాంకంలోనూ నేదునూరి పిఠాపురం పాదగయ క్షేత్రంపై తనకు ఉన్న భక్తిభావాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ మరణానికి నెలన్నర ముందు పాదగయను కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. పాదగయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించారు. జన్మస్థలం అమ్మ ఒడిలాంటిదని, పిఠాపురంపై తనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.





వెరీ గుడ్డు!

గుడ్డుతో పరిపూర్ణ ఆరోగ్యం
నేడు అంతర్జాతీయ గుడ్డు దినోత్సవం

అనపర్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే ఏకైక ఆహారం గుడ్డు అనడంలో ఎటువంటి సందేహం లేదు. పేదవారి నుంచి మధ్యతరగతి కుటుంబాల వరకు ఎన్నో రకాల వంటకాలు గుడ్డుతోనే తయారుచేస్తారు. గుడ్డును చౌకగా వచ్చే ఆహారంగానే చూస్తున్నాంగానీ దీని నుంచి లభించే పోషక విలువలు ఎంత ముఖ్యమో ఎంతమందికి తెలుసు. పూర్వం పల్లెల్లో ఇళ్ల వద్దే రైతులు కోళ్లను పెంచడం, తద్వారా వచ్చిన గుడ్లను కుటుంబంలోని సభ్యులు మాత్రమే తినడం, కొన్ని గుడ్లను బంధువులకు పంచడం జరిగేది. కాలక్రమంలో మిగిలిన గుడ్లను వారపు సంతలకు తరలించి విక్రయించడం ద్వారా గుడ్ల అమ్మకాలకు నాందిపలికారు. దేశంలో కోళ్ల పెంపకం ద్వారా గుడ్లను భారీస్థాయిలో ఉత్పత్తి చేయడం చేయడమేకాకుండా పట్టణాల్లో ఉండే వారికి సైతం గుడ్డును అందుబాటులోకి తీసుకురావాలనే బీవీ రావు కోళ్ల పరిశ్రమకు బీజం వేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ప్రస్తుతం మన రాష్ట్రం నుంచే గుడ్లను దేశ, విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి పరిశ్రమ చేరుకుంది. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ గుడ్డు ఎగుమతిలో ప్రథమ స్థానంలో నిలవగా, రాష్ట్రానికి ఉమ్మడి తూర్పుగోదావరి కోళ్ల పరిశ్రమకు రాజధానిగా మారడం అందరికీ తెలిసిందే. రాష్ట్రంలోనే ఉత్పత్తి అయ్యే గుడ్లలో సుమారు 50 శాతం మేర ఉత్పత్తి జరగడం ఇక్కడ కోళ్ల పరిశ్రమకు లభిస్తున్న ఆదరణగా చెప్పవచ్చు. అయితే గుడ్ల ఉత్పత్తికి కేంద్రంగా ఉన్న ఉమ్మడి జిల్లాలో గుడ్ల వినియోగం తక్కువగా ఉందనే చెప్పవచ్చు. అయితే గుడ్డులో లభించే పోషక విలువలను ప్రజలకు వివరించి వాటి వినియోగాన్ని పెంచే దిశగా కోళ్ల రైతులు చేస్తున్న కృషి కొనసాగిస్తూనే ఉన్నారు. వాస్తవానికి అనపర్తి ప్రాంతంలో గుడ్లు ఎగుమతిని బట్టే నెక్ గుడ్డు రేటును ప్లస్, మైనస్‌లు చేసుకుంటాయనడంతో సందేహం లేదు. అంతటి కీలకమైన మన ప్రాంతంలో గుడ్ల వినియోగం మరింత పెరగాల్సి ఉంది. ఇక ప్రతి ఏడాది అక్టోబరు నెలలో 2వ శుక్రవారాన్ని నేషనల్ ఎగ్‌డేగా నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ ఎగ్ కమిషన్ 1996లో వియన్నాలో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో తొలిసారిగా ఈ ఎగ్ డేను జరుపుకోవాలని నిర్ణయించింది. విజయవాడలో నెక్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే ఇంటర్నేషనర్ ఎగ్ డేకు మన ప్రాంతం నుంచి పలువురు రైతులు తరలివెళుతున్నారు.

ప్రభుత్వం చేయూత

కోడిగుడ్డు ద్వారా కలిగే ప్రయోజనాలను గుర్తించిన ప్రభుత్వం అటు అంగన్వాడీల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, పాఠశాలల విద్యార్థులకు, వసతిగృహ విద్యార్థులకు గుడ్డును ఉచితంగా పంపిణీ చేస్తూ కోళ్ల పరిశ్రమకు తన వంతు చేయూతనందిస్తోంది. పౌష్టికాహారం అందించడం ద్వారా ప్రజలకు చాలా ప్రయోజనం చేకూరుస్తోంది.



పోషక విలువలు వెలకట్టలేం

డాక్టర్ తాడి రామగురెడ్డి, అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

- కూరగాయలు, పండ్లలో లేని విటమిన్ బి12, విటమిన్‌డి, ఫోలిక్ యాసిడ్ గుడ్డులో లభిస్తాయి. కాలుష్యం వల్ల ఏర్పడే దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు గుడ్డులోని పచ్చసొనలో ప్రత్యేకంగా కాపర్, జింక్, మాంగనీస్, సెలీనియమ్‌లు దోహదపడతాయి.
- మానసిన ఒత్తిడిని తగ్గించేందుకు గుడ్డులోని తెల్లసొనలో హిస్టోడిన్, జింక్, కోలిన్, అయోడిన్, లినోలిక్ యాసిడ్‌లు ఉపయోగపడతాయి.
- ఊబకాయులకు పచ్చసొనలో శరీర సౌష్టవాన్ని కాపాడే విటమిన్‌డి, కొవ్వును కరిగించే కోలిన్ అనే ధాతువు, సెలీనియమ్, బి12లు ఉపయోగపడతాయి.
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుడ్డులోని తెల్లసొన ద్వారా లభించే ప్రొటీన్‌ప్యాంక్రిస్ ద్వారా గ్రంథిని నిర్మించి జింకు క్రోమీన్ ద్వారా ఇన్సులిన్ క్రియను కలుగజేసి ఎంతో ఉపయోగపడుతుంది.
- కంటిని రక్షించేందుకు గుడ్డులోని విటమిన్-ఏ ప్రధాన జీవపోషకంగా ఉపకరిస్తుంది.
- ఎముకల పటిష్టతకు గుడ్డులోని పచ్చసొనలో అధికంగా ఉండే కాల్షియం ఉపయోగపడుతుంది.

..ఇలా అన్ని రకాల అనారోగ్య సమస్యలకు గుడ్డు ఎంతో ఉపయోగపడడమే కాకుండా ఆరోగ్యవంతులకు ఎన్నో రకాల పోషక విలువలను అందిస్తుంది. గుడ్డులో 96 శాతం కేలరీలు, విటమిన్ ఎ, డి, ఈ, కె. బి6, బి12 క్యాల్షియం, ఐరన్, జింకు, ఫోలైట్, ఫోలిక్ యాసిడ్, పాస్ఫరస్, పొటాషియం, క్లోరిన్, కాపర్, మెగ్నీషియం, సీలియమ్‌లతో పాటు అనేక రకాల విటమిన్లు లభిస్తాయి.



కోళ్ల పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉపాధి

- పడాల సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్



జిల్లాలో కోళ్ల పరిశ్రమ ద్వారా అనేక కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం నుంచి తూర్పుగోదావరి జిల్లాలో గల కోళ్ల పరిశ్రమలకు కూలీలుగా వచ్చిన అనేక మంది ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అనేక కుటుంబాలకు జీవనోపాధి లభిస్తోంది. గుడ్డు విశిష్టతను తెలియజేస్తూ గుడ్డు వినియోగం పెరిగే విధంగా ప్రతి ఏటా అక్టోబరు 2వ శుక్రవారం అంతర్జాతీయ ఎగ్‌డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 2.40 కోట్ల గుడ్లు ఉత్పత్తి జరుగుతుండగా, వీటిలో 40 శాతం మేర ఇక్కడ వినియోగిస్తున్నారు.



విద్యుత్ వెలుగుల్లో వాడపల్లి ఆలయం

కోనసీమ తిరుమల వాడపల్లి బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. ఈ పుణ్యక్షేత్రం తొమ్మిది రోజుల పాటు వేద ఘోష, మంగళవాయిద్యాలతో పులకించనుంది. గ్రామానికి విచ్చేసే మార్గాలన్నీ స్వాగత ద్వారాలు, విద్యుద్దీపాలంకరణలతో వెలుగొందుతున్నాయి. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని వసంత, ముఖ మండపాలను ఫల, పుష్పాలు, వివిధ రాష్ట్రాలకు చెందిన వెరైటీ రంగుల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.



బ్రహ్మోత్సవ శోభ

- 13వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వాడపల్లి
- శ్రీవేంకటేశ్వరస్వామికి 9 రోజుల పాటు వాహన సేవలు
- తిరుమల తరహాలో విస్తృత ఏర్పాట్లు



ఆత్రేయపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి తిరుమల తరహాలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో యాగశాలను సిద్ధం చేశారు. రాష్ట్ర మంత్రులు, జిల్లా అధికారులు, ప్రముఖులకు శుభ పత్రికలను అందజేసి ఆహ్వానించారు. పట్టణాల నుంచి పల్లెల వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు ఎల్‌ఈడీలతో డిజిటల్ ప్రచారం చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ వాహనాలపై శ్రీవారు తిరువీధుల్లో విహరించి భక్తులకు కృపాకటాక్షాలు అందించనున్నారు. శుక్రవారం రాత్రి పరావాసుదేవ అలంకరణతో శేషవాహన సేవ, 11వ తేదీ రాత్రి సరస్వతి అలంకరణతో హంస వాహన సేవ, 12న కోదండరామ అలంకరణతో హనుమత్ వాహన సేవ, 13న యోగానరసింహ అలంకరణతో సింహ వాహన సేవ, 14న మలయప్ప అలంకరణతో గరుడ వాహన సేవ, 15వ తేదీ ఉదయం శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ, రాత్రి మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ, 16న రాజాధిరాజ అలంకరణతో గజ వాహన సేవ, 17వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహన సేవ, రాత్రి కల్కి అలంకరణతో అశ్వవాహన సేవ జరుగుతాయి. 18న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

తొమ్మిది రోజుల పాటు మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులకు కనువిందు చేయనున్నారు.

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామన్నారు.



కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఉప కమిషనరు సూర్యచక్రధరరావు



దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ దంపతులకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న దృశ్యం

ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు

ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడును కలిసి బ్రహోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ దంపతులను ఆహ్వానించి స్వామివారి చిత్రపటం అందజేశారు. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఈవో శీనా నాయక్‌కు కూడా ఆహ్వానం పలికారు.

అన్ని డిపోల నుంచి వాడపల్లికి ప్రత్యేక బస్సులు

రావులపాలెం డిపో మేనేజరు కుమార్



రావులపాలెం (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వాడపల్లికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజరు వైవీఎస్ కుమార్ తెలిపారు. రావులపాలెం డిపో నుంచి 12, రామచంద్రపురం డిపో నుంచి 3, అమలాపురం డిపో నుంచి 4, రాజోలు డిపో నుంచి 4 బస్సులు వెళ్తాయన్నారు. రావులపాలెం డిపో నుంచి 12 బస్సులు 156 ట్రిప్పులు తిరిగేలా కార్యాచరణ రూపొందించామని కుమార్ చెప్పారు.



రాజమహేంద్రవరంలోని పుష్కర ఘాట్ వద్ద అట్లతద్ది నోము తీర్చుకుంటున్న మహిళలు

అట్ల తద్దోయ్ ఆర ట్లోయ్

గౌరీదేవికి భక్తి శ్రద్ధలతో మహిళల పూజలు



అంబాజీపేటలో ఉయ్యాల ఊగుతున్న మహిళ

అట్లతద్ది పండుగను మహిళలు గురువారం వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి స్నానాలు చేసి అట్లతద్దోయ్... ఆరట్లోయ్ అంటూ సందడి చేశారు. వయో బేధం లేకుండా అందరూ గౌరీదేవిని పూజించారు. అమ్మాయిలు తమకు మంచి భర్త దొరకాలని, అమ్మలు తమ కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని.. అమ్మమ్మలు తమ జీవితం సాఫీగా సాగాలంటూ గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి పూజలు జరిపి ఊయాలలూగారు.



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద బొట్టు పెట్టి తాంబూలం, వాయినం ఇస్తున్న మహిళ

సాయంత్రం మరలా గౌరీదేవికి పూజలు చేసి గోదావరి, నదీపాయల్లో దీపాలు, అర్ఘ్యాలు వదిలారు. అనంతరం ముత్తయిదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.



ముమ్మిడివరంలో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు



కాకినాడ జిల్లా సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో...

సత్యదేవుని సన్నిధిలో హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు



సత్యదేవుని దర్శనానంతరం సత్యగౌర చంద్ర దాస, హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు

అన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి గురువారం హరేకృష్ణ గ్లోబల్ టెంపుల్ ప్రతినిధులు, అక్షయపాత్ర ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస విచ్చేశారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈవో వీర్ల సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలవగా ఆయన అక్షయపాత్ర నిర్వహణ తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు.

మత్స్యకార సమస్యలు పరిష్కరిస్తాం

● మూడునెలల్లో అన్నీ సమసిపోతాయ్
● ఉప్పాడ మత్స్యకారులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 'మాటామంతీ'


సమావేశంలో మాట్లాడుతున్న పవన్

కాకినాడ/ కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ పరిసర ప్రాంత మత్స్యకారుల సమస్యలపై మూడునెలల్లో సమగ్ర పరిష్కారం చూపుతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. కలెక్టరేట్ వివేకానంద సమావేశహాలులో గురువారం ఆయన మత్స్యకారులతో మాటా-మంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకార గ్రామాల పెద్దలు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలతో ముఖాముఖిగా వారి సమస్యలను తెలుసుకున్నారు.

● పరిశ్రమల వ్యర్థాలతో సముద్ర జలాల కలుషితం

ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట తదితర మత్స్యకార గ్రామాల ప్రతినిధులు కె.రాంబాబు, కె.వెంకటరమణ, సీహెచ్ దావీదు, కొల్లి రాంబాబు, ప్రసాద్, సూరాడరాజు, ముమ్మిడి జాన్సన్, కొండా వెంకటరమణ, బడే విజయకుమార్, పైడిపల్లి రాజు, మత్స్యకార యువకులు మోసా దేవళ్లు, వంకా ఎఫేజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సతీష్, మత్స్యకార మహిళ ఉమ్మిడి అమరేశ్వరి పరిశ్రమల వ్యర్థాలు, ప్రకృతి వైపరీత్యాలవల్ల మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పవన్‌కు వివరించారు. పరిశ్రమల వ్యర్థాలతో సముద్రజలాలు కాలుష్యమయ్యాయని, దీంతో ఉపాధికి నష్టం వాటిల్లుతోందని మత్స్యకారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మత్స్య సంపద నాశనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. చాలా ఏళ్లుగా ఉన్న ఈ సమస్యను ఇవాళే ఎందుకు తెరమీదకు తెచ్చారని, అంత రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, తమ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన మీ దృష్టికి తీసుకువెళ్తే సమస్య పరిష్కారమవుతుందనే ఉద్దేశంతో సముద్రజలాల కలుషిత విషయమై ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. సమస్యల పట్ల ఆవేదనతో తొందరపాటుగా ఆందోళనకు దిగినందుకు చింతిస్తున్నామని, ఉపముఖ్యమంత్రి పెద్ద మనసుతో తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

● పొల్యూషన్ ఆడిట్ చేపట్టండి..

ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు తెలిపిన పారిశ్రామిక కాలుష్యంపై పొల్యూషన్ ఆడిట్ చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. వారంరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. వందరోజుల్లోగా ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని మత్స్యకార ప్రతినిధులకు ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలు, మత్స్యశాఖ, పీసీబీ, పరిశ్రమల ప్రతినిధులు, మత్స్యకారులు, ఎన్జీఓలు, స్టేక్‌హోల్డర్స్ అందరినీ భాగస్వాములను చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. కాలుష్యస్థాయిపై ప్రాథమిక నివేదిక అందజేయాలని రాష్ట్ర పీసీబీ మెంబర్ సెక్రటరీని కోరారు. నిర్మాణంలో ఉన్న హార్బర్ డిజైన్ లోపాలపై ఐఐటీ చెన్నై నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం మత్స్యకార బోట్లకు ముప్పు లేకుండా డిజైన్ కరెక్షన్ చేయిస్తానన్నారు. రాష్ట్ర, దేశ అభివృద్ధికి పరిశ్రమలు కూడా అవసరమని, ప్రజల జీవనోపాధికి విఘాతం, లోటు లేకుండా సమతుల్యం పాటించాలన్నారు. ఉప్పాడ బోట్ల ల్యాండింగ్ అంశంలో అంతర్వేది, మచిలీపట్నం ప్రాంత మత్స్యకారులు, ప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఓఎన్జీసీ తరహాలో పరిహారం అందించే అంశం పరిశ్రమలు, మత్స్య, కాలుష్య నియంత్రణ తదితర శాఖలతో ముడిపడిన మల్టీ డిపార్ట్‌మెంటల్ అంశమని ఆయాశాఖలను సమన్వయపరిచి నిర్ణయించాల్సి ఉందన్నారు.

● ఉప్పాడ తీర రక్షణకు ఢిల్లీ వెళతా..

అలల కోత నుంచి ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు అవసరమైన రూ.320 కోట్ల నిధులు కేంద్ర హోంశాఖ నుంచి విడుదలయ్యేలా తానే స్వయంగా ఢిల్లీ వెళ్లి హోంమంత్రి అమిత్‌షాను కలుస్తానన్నారు. వచ్చే రెండు, మూడు ఏళ్లల్లో ఈ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

● పరిహారం చెక్కుల పంపిణీ

సముద్రవేటలో ప్రమాదవశాత్తూ మరణించిన 18 మంది మత్స్యకార కుటుంబాలకు గ్రూపు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద తొలివిడతగా ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.90లక్షల ఎక్స్‌గ్రేషియా మొత్తాల చెక్కులను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంపిణీ చేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకార ప్రతినిధులు

17న కేశనపల్లిలో పవన్ కల్యాణ్ పర్యటన

రాజోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం శంకరగుప్తం డ్రైన్ ముంపు వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ఈనెల 17 వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కేశనపల్లి రానున్నారని రాజోలు ఎమ్మెల్యే దేవా వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా రాజోలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు రైతులు, బాధితులతో మాట్లాడతారని పేర్కొన్నారు. అలాగే పొదలాడ పంచాయతీ కార్యాలయంలో కూటమి నాయకులు, అధికారులతో పవన్ పర్యటనపై చర్చించారు. పొదలాడలో జాతీయ రహదారి 216 పక్కన ఉన్న పొదలాడ సెంటర్ నుంచి గ్రామపంచాయితీ కార్యాలయం వరకు ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 50 లక్షలతో కిలోమీటరు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పవన్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. చాగంటి స్వామి, సర్పంచ్ కడలి సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

చోరీ సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీసులు ఇద్దరు మహిళా దొంగలను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న దేవరపల్లి మండలం యర్నగూడేనికి చెందిన జాగాని నాగమాధవి తన భర్త, పిల్లలతో కలిసి రాజమండ్రి రావడానికి ఆటో ఎక్కారు. కాపవరం సమీపంలో ఇద్దరు మహిళలు అదే ఆటో ఎక్కి, ప్రయాణంలో సీటు జాగా సరిపోవడం లేదంటూ మాధవి దృష్టి మరల్చారు. ఆ ఇద్దరు మహిళలు కోటిపల్లి బస్టాండ్ వద్ద ఆటో దిగిపోయారు. రైల్వే స్టేషన్ సమీపంలో మాధవి తన హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా జిప్ ఓపెన్ చేసి ఉంది. బ్యాగులో ఉంచిన బంగారు ఆభరణాల ప్లాస్టిక్ బాక్స్ కనిపించలేదు.దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆవుల భూలక్ష్మి, నాగెల్లి దుర్గను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామని సీఐ చెప్పారు. వాళ్ల వద్ద నుంచి 70గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఎలక్ట్రీషియన్ మృతి


ట్రాక్టర్ ఢీకొని మృతిచెందిన పవన్ తేజ

పిఠాపురం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.తిమ్మాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు. ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామానికి చెందిన కాదులూరి పవన్‌తేజ(27) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం యర్రవరం నుంచి కాకినాడకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. పి.తిమ్మాపురం గ్రామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో పవన్‌తేజ ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పిఠాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి (45)గురువారం సాయంత్రం మృతి చెందాడు. కాలనీ పరిసర ప్రాంతాల్లో చెత్తకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే వ్యక్తికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయి. పాత ఎక్సైజు స్టేషన్ వద్ద కుప్పకూలిపోయాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అతడిని పరీక్షించి చనిపోయినట్టు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదని తెలిపారు.

'రాయవరం' బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

● రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలు పరిశీలించిన మంత్రి సుభాష్
● పేలుడు ఘటనలో ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య
● బాణసంచా తయారీ కేంద్రాల్లో విస్తృత తనిఖీలకు ఆదేశాలు


మృతుల బంధువులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం జరిగిన బాణసంచా విస్ఫోటనం ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోని మృతదేహాలను ఆయన పరిశీలించారు. పేలుడు ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరుకోవడంపై విచారం వ్యక్తం చేశారు. అనంతరం మృతుల కుటుంబీకులతో మాట్లాడి ఓదార్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ప్రవీణ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ బాణాసంచా కేంద్రం వద్ద శాంపిల్స్ సేకరించి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామన్నారు. తయారీకి సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రమాదం జరగడం, యజమానితో సహా ఎనిమిది మంది మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఆయన వెంటపాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు వుండవిల్లి శివ, మున్సిపల్ మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● పేలుడుపై దర్యాప్తునకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీ

బాణసంచా పేలుడుకు సంబంధించి నిజానిజాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. మునిసిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ నేతృత్వంలో దర్యాప్తు జరగనుంది. ఇందులో కమిటీ సభ్యుడిగా ఐజీ ఆకే రవికృష్ణను ఉన్నారు. ఈ దుర్ఘటనకు బాధ్యులెవరో తేల్చాలని పేర్కొంది. కమిటీకి సహకరించాలని కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనాకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

పేలుడు ఘటనలో అసువులు బాసిన ఏడుగురి మృతదేహాలకు గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ప్రవీణ్,ఆర్ఎంవో డా. చక్రధర్ పర్యవేక్షణలో ఆసుపత్రి వైద్యులు, మండపేట ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగింది. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ ఎం.వెంకట నారాయణ, మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన విజయలక్ష్మి


విజయలక్ష్మి (ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ)/ రాయవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) కొమరిపాలెం బాణసంచా విస్ఫోటనంలో తీవ్ర గాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి మృత్యువుతో పోరాడి బుధవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచింది. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన వాసంశెట్టి విజయలక్ష్మి (45) కు భర్త వెంకట్రావు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఏడాది కాలంగా కొమరిపాలెం శివారు ప్రాంతంలో ఉన్న శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో తన కుమార్తె దుర్గతో పాటు వెళ్లి బాణసంచా కార్మికులుగా పని చేస్తున్నారు.

నమూనాలు సేకరించిన ఫోరెన్సిక్ ల్యాబ్ సిబ్బంది

● సంఘటనా స్థలం నుంచి మందుగుండు సేకరణ

మండపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలో బుధవారం బాణసంచా దుకాణంలో జరిగిన పేలుడు సంఘటనపై విజయవాడకు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్‌సభ్యులు, స్థానిక పోలీస్ క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని శాంపిల్స్‌ను సేకరించారు. అసలు ప్రమాదం ఎలా జరిగింది, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి పేలిన ప్రదేశం నుంచి కాలిబూడిదైన మందుగుండు సామగ్రిని శాంపిల్స్ నిమిత్తం విజయవాడ ల్యాబ్‌కు తీసుకువెళ్లారు. కాగా, ముడిసరుకుతో తయారు చేసే చిచ్చుబుడ్లు, మతాబులు, టపాసులు, తారాజువ్వలు వంటివి తయారు చేసే సమయంలో మందును దట్టించే సమయంలో పేలుడు సంభవించవచ్చని ఫైర్ నిపుణులు చెబుతున్నారు. మొత్తమ్మీద ఏది ఎమైనప్పటికీ రాయవరంలో జరిగిన విస్ఫోటనం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా కలచివేసింది.

పిడుగుపాటుకు వ్యాపారవేత్త మృతి

● కాకినాడకు చెందిన వాసిగా గుర్తింపు


మృతిచెందిన కొవ్వూరు వెంకట రామకృష్ణా రెడ్డి

చేజర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో కాకినాడలో వ్యాపారవేత్తగా రాణిస్తూ వ్యవసాయం మీద మక్కువతో నెల్లూరు జిల్లా చేజర్ల మండలం చేజర్ల కండ్రిక సమీపంలో పొలం తీసుకుని పనులు చేయిస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెందిన సంఘటన స్థానికులను కలచివేసింది, పూర్తి వివరాల మేరకు ... కాకినాడలో బిల్డర్ కాంట్రాక్టర్‌గా రాణిస్తున్న కొవ్వూరు వెంకట రామకృష్ణారెడ్డి (60) వ్యవసాయం చేయాలన్న ఉద్దేశంతో చేజర్ల సమీపంలో కొంతకాలం క్రితం పొలాన్ని తీసుకున్నాడు. రెండునెలల నుంచి అక్కడే ఉంటూ పొలంలో రోడ్లు, తదితర పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం కూలీల చేత పనులు చేయిస్తుండగా ఒక్కసారిగా మారిన వాతావరణంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, మృతుడు వెంకటరామ కృష్ణారెడ్డి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో మమేకమై అందరితో కలిసిపోయేవాడని, ఇంతలోనే ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు నెల్లూరుకు బయలుదేరినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటరామ కృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాణసంచా పేలిన ఘటనలో..

● చికిత్స పొందుతూ పురోహితుడు మృతి

పి.గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఊరేగింపులో ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలి గాయాలపాలైన ఇద్దరు పురోహితుల్లో ఒకరు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం మానేపల్లిలో ఈనెల 4వ తేదీ రాత్రి జరిగిన అమ్మవారి ఊరేగింపుల్లో సేవలో ఉన్న పురోహితులు వెలవలపల్లి విజయ ప్రసాద్ (55), పెద్దింటి రామరత్నగోపాల్ (35)కు ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇద్దరు పురోహితుల్ని అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వారిలో విజయప్రసాద్ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం 4.30 సమయంలో మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీ.శివకృష్ణ తెలిపారు.

అనుమతుల్లేని మందుగుండు సామగ్రి సీజ్


కడియపులంకలో పోలీసులు పట్టుకున్న మందుగుండు సామగ్రి

కడియపులంకలో రూ.2,51,600 విలువైన క్రాకర్స్ స్వాధీనం

కడియం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు, లైసెన్సులు లేకుండా ఫైర్ క్రాకర్స్ స్టాక్ పాయింట్లను పోలీసులు గుర్తించారు. సీఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటు వంటి అనుమతులు లేకుండా కడియపులంకలో బలభద్రుని నాగవీరసూర్యప్రకాష్ ఇంటిలో రూ.1,25,000 విలువైన క్రాకర్స్, గ్రంధి శ్రీరామచంద్రమూర్తికి చెందిన షాపులో రూ.21,600 విలువైన క్రాకర్స్, గెల్లి వెంకటేశ్వరరావు ఇంటిలో రూ.1,05,000 విలువైన క్రాకర్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు తెలిపారు. వీరిపై విడివిడిగా మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ధనలక్ష్మి, స్పెషల్ బ్రాంచి హెడ్ కానిస్టేబుల్ జనార్ధనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్రాకర్స్ ఉంచరాదని, అలా ఉంచితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంధకం, పటాస్ నిల్వలు సీజ్


కొత్తపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీకి ఉపయోగించే అక్రమంగా నిల్వ ఉంచిన గంధకం, పటాస్, క్లోరైడ్‌లను కొత్తపేట పోలీసులు సీజ్ చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కొత్తపేట ఆర్ఎస్ నగర్‌లో యర్రంశెట్టి మురళీకృష్ణకు చెందిన ఇంట్లో ఎక్స్‌ప్లోజివ్స్ నిల్వ చేసినట్టు వచ్చిన సమాచారం మేరకు రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.సురేంద్ర దాడి చేశారు. ఈ మేరకు 200 కిలోల ఎక్స్‌ప్లోజివ్‌ను సీజ్ చేశామని, వాటి విలువ సుమారుగా రూ.1,04,730 ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

జొన్నాడలో అనధికార స్టోన్ క్రషర్ సీజ్


అనధికారికంగా ఉన్న క్రషరును సీజ్ చేస్తున్న అధికారులు

ఆలమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరి ఒడ్డున అనధికారికంగా ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్‌ను గురువారం అధికారులు సీజ్ చేశారు. ఇక్కడ కొంతకాలంగా జరుగుతున్న స్టోన్ క్రషింగ్ రైతులకు ఇబ్బందికరంగా మారడంతో పలువురు రైతులు స్థానిక అధికారులతోపాటు కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో క్రషర్‌ను సీజ్ చేయాలని గత నెల 29న నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ క్రషర్‌ను నిర్వహిస్తుండడంతో రైతులు చేసిన ఫిర్యాదుతో ఎంపీడీవో ఎ.రాజు ఆదేశాల మేరకు మండల పరిషత్ ఏవో ఎం.మోహర్‌ప్రకాష్, జొన్నాడ కార్య దర్శి సీహెచ్.వీరమాత, పోలీసులు, సిబ్బందితో వెళ్లి నోటీసులు అంటించి సీజ్ చేశారు. అనుమతులు లేనిదే ఎటువంటి క్రషింగ్ చేయడానికి వీలు లేదని వారు హెచ్చరించారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు మేఘన ఎంపిక


మేఘనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముమ్మిడివరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల బాలుర, బాలికల షూటింగ్‌బాల్ చాంపియన్ షిప్‌లో ముమ్మిడివరం మండలం కొత్తలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గెద్దాడ మేఘన ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. నవంబరు 7 నుంచి 9వరకు ఉత్తరప్రదేశ్ హెచ్ఆర్ఐటీ యూనివర్శిటీలో జరిగే జూనియర్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని పీడీ కొప్పిశెట్టి సుజాత తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన మేఘనను విద్యాకమిటీ చైర్మన్ జైన్ బాబ్జి, హెచ్ఎం గోవర్దనగిరిరావు, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న 14 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్

» కోరంగి చేయూత మార్ట్‌లో రూ.15.80 లక్షల దుర్వినియోగం
» ఇద్దరు ఏపీఎంలు, మరో ఇద్దరు కమ్యూనిటీ కోఆర్డినేటర్లపై వేటు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో గొల్లప్రోలు ఏపీఎం సన్యాసిరావు, తాళ్లరేవు ఇన్‌చార్జి ఏపీఎంగా పనిచేసిన విష్ణు, మరో ఇద్దరు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు (సీసీలు) ఉన్నారు. మండలంలోని కోరంగిలో ఉన్న చేయూత మార్ట్‌లో రూ.15.80 లక్షలు నిధులు దుర్వినియోగం అవ్వడంతో వీరిపై వేటు వేశారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేయూత మార్ట్‌ను డ్వాక్రా సభ్యుల ఆర్థిక ఉన్నతి కోసం స్థాపించారు. దీని స్థాపన కోసం మండలంలో ఉన్న ఒక్కొక్క డ్వాక్రా గ్రూపు నుంచి వేలాది రూపాయలు పెట్టుబడి కింద సేకరించారు. మార్ట్‌లో నిత్యావసర వస్తువులను విక్రయించేవారు.వాటి ద్వారా వచ్చిన ఆదాయంలో లాభాలను డ్వాక్రా సంఘాలకు పంపిణీ చేస్తామని నమ్మబలికారు. తీరా వస్తువులు విక్రయించగా వచ్చిన సొమ్ములను సంబంధిత బ్యాంకు ఖాతాకు జమ చేయకుండా దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఇద్దరు ఏపీఎంలు, మరో ఇద్దరు సీసీలను సస్పెండ్ చేశారు. అయితే గతంలో తాళ్లరేవులో పనిచేసిన ఏపీఎం విష్ణు ఇప్పుడు కోనసీమ జిల్లా మండపేటలో విధుల్లో ఉన్నారు. ఈ క్రమంలో విష్ణును సస్పెండ్ చేయాలని ఆ జిల్లా డీఆర్‌డీఏ పీడీకి కాకినాడ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఒక ఉత్తర్వును పంపించారు. కాగా కాకినాడ డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సొమ్ములు దుర్వినియోగం చేసిన నలుగురిని సస్పెండ్ చేశామన్నారు. ఏపీఎం విష్ణు మండపేటలో విధుల్లో ఉండటం వల్ల ఆయన్ని సస్పెండ్ చేయాలని కోనసీమ డీఆర్‌డీఏ పీడీని కోరామన్నారు.

జీజీహెచ్‌లో ముగ్గురిపై వేటు

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో రోగుల నుంచి లంచం తీసుకుంటున్నారనే అవినీతి ఆరోపణల ఎదుర్కొంటున్న ఇద్దరు ఎఫ్ఎన్‌వోలు, ఒక ఎంఎన్‌వోను సస్పెండ్ చేస్తూ వైద్యాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో రెగ్యులర్ ఎఫ్ఎన్‌వో జె.వరలక్ష్మి, అవుట్ సోర్సింగ్ ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు సువర్ణశ్రీ, అచ్యుత్‌కుమార్ ఉన్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఉద్యోగి డి.అన్నపూర్ణను తొలగించాలని కాంట్రాక్ట్ సంస్థకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నలుగురు గైనిక్ ఆపరేషన్ థియేటర్(జీవోటీ)లో పని చేస్తున్నారు.

నేడు, రేపు డిస్ట్రిక్ట్ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ సేల్ అండ్ ఎక్స్‌పో

రాజమహేంద్రవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 విధానం వల్ల వివిధ వస్తువులపై తగ్గిన పన్ను రేట్లపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి శుక్ర, శనివారాల్లో డిస్ట్రిక్ట్ ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ సేల్ అండ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రవరం (తూర్పు, కోనసీమ జిల్లాల) జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎం.సుధాకర్ తెలిపారు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీహాల్‌లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ నినాదంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు, ఇతర ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు.నగరంలోని సాధారణ ప్రజానీకం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, తగ్గిన ధరలను తెలుసుకోవాలని ఆయన కోరారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో సాహితికి కాంస్యం

జేఎన్టీయూకే, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకే ఏఐఎంఎల్ విద్యార్థిని కె.సింధూర సాహితి 8వ అంతర జిల్లాల షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ పోటీలు సెప్టెంబరు 25, 26 తేదీల్లో కర్నూల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థిని వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, డైరెక్టర్ కృష్ణమోహన్ అభినందించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పరిశ్రమల శాఖ భవన నిర్మాణం పూర్తికి రూ.65.87 లక్షలు మంజూరు

కాకినాడ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని పరిశ్రమల శాఖ భవన నిర్మాణం పూర్తికి రూ.65.87 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఈ భవన నిర్మాణ పనులు బిల్లుల సమస్యతో ఆగిపోయాయి. దీంతో నిధులు మంజూరు చేస్తూ పరిశ్రమల శాఖ జీవోఆర్‌టీ నెం.168 జారీ చేసింది.


పెద్దాపురం మండలంలో అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప


కాకినాడలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో నాయక్


కరపలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై విస్తృత ప్రచారం

పెద్దాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ ఫలాలు ఇంటింటికీ అందాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆకాంక్షించారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాలకు, రైతులకు, ఆరోగ్య రంగానికి ఈ నిర్ణయాలు గణనీయమైన ఉపశమనం కల్పిస్తాయన్నారు. మండలంలోని తిరుపతి, చదలాడ గ్రామాల్లో సూపర్ జీఎస్టీ సేవింగ్స్ పేరిట గురువారం నిర్వహించిన క్యాంపెయిన్‌లో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అన్ని వర్గాల ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. ఈ విషయాలను పార్టీ నాయకులు, అధికారులు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు కలగడమే కాకుండా వ్యాపారాలు ఊపందుకుంటాయన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి, ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

జీజీహెచ్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీఎస్టీ 2.0 వల్ల కలిగే లాభాలను వివరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో సూపర్ జీఎస్టీపై హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌సీడీపీవో డాక్టర్ వి.అరుణ, డీపీఎంవో డాక్టర్ జి.లక్ష్మి, డీఎంవో డాక్టర్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): వస్తువులు, సేవలపై విధించే జీఎస్టీని ప్రభుత్వం గణనీయంగా తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు తెలిపారు. కరప పీహెచ్‌సీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని రెండు శ్లాబులకు కుదించి పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఎక్కడైనా పాత జీఎస్టీ శ్లాబులు కొనసాగిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏఏ వస్తువులు, సేవలపై జీఎస్టీ ఎంత తగ్గిందో వివరిస్తూ బ్రోచర్లను ప్రదర్శించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రవిరాజు, పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాకుమారి, కరప సొసైటీ చైర్‌పర్సన్ సైనవరపు భవానీశంకర్, కూటమి నాయకులు దేవు వెంకన్న, బోగిరెడ్డి కొండబాబు, యాళ్ల పండు, పేపకాయల పవన్‌కుమార్, సీహెచ్‌వో జి.ఏసురత్నం, హెచ్‌ఎస్ రాజగోపాలరావు, పీహెచ్‌ఎన్ సత్యనారాయణమ్మ, హెచ్‌వీ సీత, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, గర్భిణులు పాల్గొన్నారు.

మహా సంస్థానంలో సత్యదత్త వ్రతాలు

పిఠాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో గురువారం సత్యదత్త వ్రతాలు వైభవంగా జరిగాయి. శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పార్చన నిర్వహించారు. గోపూజ, ప్రదక్షిణ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'కైట్' విద్యార్థులు 18 మందికి ఉద్యోగాలు

కాకినాడ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కైట్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న 14 మంది విద్యార్థులు కుమెన్స్ కంపెనీలోను, నలుగురు ఇతర కంపెనీల్లోను క్యాంపస్ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. వారందరికీ ఏడాదికి రూ.4.25లక్షల ప్యాకేజీ లభిస్తుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్స్ రేవతి, రామకృష్ణ, వైఎస్ రావు, అకడమిక్ సమన్వయకర్త ఎస్ఎస్ రావు అభినందించారు.

పాదగయలో 'అక్షయపాత్ర' చైర్మన్

పిఠాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని హైదరాబాద్ హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్, అక్షయపాత్ర ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ సత్య గౌర చంద్ర దాస గురువారం రాత్రి సందర్శించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు పండితులు క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించారు. చంద్రదాసను ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల ఫొటో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పండితులు వింజమూరి సుబ్బన్న, అల్లంరాజు చంద్రమౌళి, సూపరింటెండెంట్ వీరభద్రరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

'పెద్దింశెట్టి హౌస్ అరెస్ట్ అప్రజాస్వామికం'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావుని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని పలువురు బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం కాకినాడ 2వ డివిజన్ సురేష్‌నగర్‌లో హౌస్ అరెస్ట్‌లో ఉన్న పెద్దింశెట్టిని బీసీ సంఘాల జిల్లా నాయకులు చొల్లంగి వేణుగోపాల్, మాకినీడి భాస్కర్‌గణేష్, అల్లి రాజబాబుయాదవ్, వాసంశెట్టి రాజేశ్వరరావు తదితరులు కలుసుకుని సంఘీభావం తెలిపారు.

అంధత్వ నివారణపై ర్యాలీ

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) వరల్డ్ సైట్ డేను పురస్కరించుకుని అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ జెండా ఊపి ప్రారంభించారు. 'లవ్ యువర్ ఐస్' నినాదంతో జరిగిన ప్రదర్శన సాగింది. జిల్లా ప్రోగ్రాం మేనేజరు డాక్టర్ వి.శ్రీవిద్య, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా నాగభూషణం

సామర్లకోట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలంలోని ఏడు గ్రామాల క్లస్టర్ ఇన్‌చార్జిగా నవరకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తోట నాగభూషణాన్ని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సిఫార్సు మేరకు ఈ నియామకం జరిగింది.


విజేతలను అభినందిస్తున్న బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

'విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి'

కరప, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలనిరాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. కరప హైస్కూలు ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను గురువారం ఆయన అధికారులు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తామని ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి తెలిపారు. విజేతలను అభినందించి బహుమతు లు ప్రదానం చేశారు. ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని దుర్గారాణి, వ్యాయామ ఉపాధ్యాయులు జి.చంద్రశేఖర్, శ్రీనివాస్, కూటమి నాయకులు దేవు వెంకన్న, కొండబాబు, పోలిశెట్టి తాతీలు, సైనవరపు భవానీశంకర్, యాళ్ల పండు, శివకుమార్, వి.రమణ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్వదేశీ ఉత్పత్తులపై మరింత అవగాహన కల్పించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తుల వినియోగగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని సత్కళావాహినిలో గురువారం ఆయన ఆధ్వర్యంలో 'ఆత్మ నిర్భర్ భారత్' కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ముఖ్య వక్త గారపాటి వీరాంజనేయ చౌదరి, ఆత్మ నిర్భర్ భారత్ ఇన్చార్జి కళ్యాణ్ చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేక్ ఇన్ ఇండియా మాదిరిగానే దేశంలో తయారీ పెంచడం, స్థానికంగా ఉత్పత్తులు చేయడం వల్ల ఉద్యోగాలు పెరుగుతాయన్నారు. వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూడా ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగమే అన్నారు. నాయకులు సాలగ్రామ లక్ష్మీప్రసన్న, చోడిశెట్టి రమేష్‌బాబు పాల్గొన్నారు.

'జగన్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించాలి'


అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

కాకినాడ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలో భాగంగా చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన వైసీపీని, జగన్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇంద్రపాలెం వంతెన సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ పెద్దల డైరెక్షన్‌తోనే వైసీపీ నేతలు రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు ఈ ఘాతుకానికి పాల్పడ్డారన్నారు. ఈ కుట్రలో వైసీపీ సర్పంచ్ గోవిందయ్యతో పాటు పలువురు పాల్గొన్న విషయం సాక్ష్యాధారాలతో బయటపడిందన్నారు. ధర్నాలో టీడీపీ ఎస్సీ సెల్ నగర శాఖ అధ్యక్షుడు సీకోటి అప్పలకొండ, జిల్లా కార్యదర్శి బచ్చల నాగశివ, కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పలివెల రవి, నాయకులు అందుగుల జార్జిచక్రవర్తి, బొండాడ నారాయణ, కాకర జార్జ్, బంగారు సత్యనారాయణ, ఏవీడీ మెంటారావు, నూకతాటి ఈశ్వరుడు, అందుగుల మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరి అమ్మవారి హుండీల ఆదాయం రూ.9.67 లక్షలు

కాకినాడ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యారావుపేటలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీలను ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి, దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణి, భక్తులు, ఆలయ ఉద్యోగులు, సేవకులు, అర్చకులు, కమిటీ సభ్యుల సమక్షంలో గురువారం తెరిచి లెక్కించారు. కరెన్సీ నోట్లు, చిల్లర నాణేలు కలిపి రూ.9,67,843 ఆదాయం రాగా ఈ సొమ్మును బ్యాంకులో జమ చేశారు. కమిటీ సభ్యులు నల్లారి తులసి, రాణి, డి.రాంబాబు, కాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు, భక్తులు, స్థానికుల సమక్షంలో తెరిచి లెక్కించారు. 3నెలల 15 రోజులకు రూ.10,53,851 ఆదాయం వచ్చింది.

'సివిల్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని, 8వ వేతన సంఘం సిఫార్సులను రిటైరైన పాత, కొత్తవారికి అమలు చేయాలి... తదితర డిమాండ్లను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ పి.మహేశ్వరరావు, కన్వీనర్ తురగా సూర్యారావు, అసోసియేషన్ ప్రతినిధులు డీఎల్ఎన్ శాస్త్రి, సీహెచ్ రామారావు, ఎన్.త్రినాథరావు, ఎస్ఎన్‌వీ సాయిరాం, ఆర్ఆర్ పట్నాయక్, కె.సత్తిరాజు, యూఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుడి జన్మదిన పూజలు

సామర్లకోట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వీరభద్రుడి జన్మదినం సందర్భంగా కుమారరామ భీమేశ్వరాలయంలోని వీరభద్రుడి ఉపాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందర రామయ్య (రాంబాబు), రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణలతో వీరభద్రుడిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పుష్పార్చన చేసి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. నంది మండపం వద్ద స్వామివారికి శాంతికర కల్యాణం జరిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) దంపతులు ఆసీనులై పూజలు చేశారు. మఠం సెంటర్ వద్ద వీరభద్రరామాలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యార్లగడ్డ నాగేశ్వరరావు, యార్లగడ్డ బాపినీడు ఆధ్వర్యంలో పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

'పిఠాపురం మహారాజా ఆస్తులు పేదలకే చెందాలి'


మహారాజా విగ్రహానికి పాలాభిషేకం చేసి పుష్పమాల వేస్తున్న ఆయన తనయుడు రత్నారావు

పిఠాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మహారాజా రాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, వాటిని పేదలకే చెందేలా చూడాలని మహారాజా తనయుడు రాజా రావు రామరత్నారావు కోరారు. మహారాజా ఆస్తులను అన్యాక్రాంతం చేయాలని కుట్ర చేస్తున్న ఒక విద్యా సంస్థ అధినేత మరికొందరు కలిసి పట్టణంలోని కోటగుమ్మం సెంటర్లో గల మహారాజా విగ్రహానికి జయంతి సందర్భంగా నివాళులర్పించారని తెలిపారు. ఆస్తులపై కన్నేసిన కుట్రదారుల నివాళులతో మహారాజా విగ్రహం అపవిత్రమైందంటూ గురువారం మహారాజా విగ్రహానికి రామరత్నారావు తదితరులు పాలాభిషేకం చేశారు. అనంతరం పలు సంచలన ఆరోపణలు చేశారు. ఒక విద్యా సంస్థ అధినేత మహారాజా కోటపై కన్నేసి అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారని తెలిపారు. రెండు ఎకరాల స్థలాన్ని మూడేళ్లకు లీజుకు తీసుకుంటానని తనను నమ్మించి మభ్యపెట్టి నాలుగు ఎకరాలను 30 సంవత్సరాలకు లీజుకు ఇచ్చినట్టు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఆ సంస్థ అధినేతకు కొందరు స్వార్థపరులు అండగా నిలుస్తూ తమ ఆస్తులతో వ్యాపారం చేయాలని చూస్తున్నారన్నారు. పేదల ఆకలి బాధలు తీర్చేందుకు, విద్యాభివృద్ధికి మహారాజా వందలాది ఎకరాల భూమిని దానం చేశారని తెలిపారు. మిగిలి ఉన్న ఆస్తులను ఆక్రమించాలని కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. తన ఆస్తులు పిల్లలకు కాకుండా పేదలకే చెందాలన్నారు. పిఠాపురం మహారాజా దాన, ధర్మాలు సేవలను డిప్యూటీ సీఎం గుర్తించి ఆయన ఆస్తులను పరిరక్షించి పేదలకు ఉపయోగపడేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై త్వరలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను స్వయంగా కలుస్తానని తెలిపారు.

సమస్యను పూర్తిగా పరిష్కరించడమే లక్ష్యం: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్


గొల్లప్రోలు హౌసింగ్ కాలనీకి చెందిన వీరబాబుతో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

గొల్లప్రోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమస్య ఉన్నట్టు గుర్తించిన తర్వాత దానిని శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తానని, తద్వారా ప్రజలకు మంచి ఫలితాలు అందుతాయని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. గొల్లప్రోలు పట్టణ శివారులో హౌసింగ్ కాలనీకి చెందిన దండు వీరబాబు తదితరులు గురువారం కాకినాడలో పవన్‌కల్యాణ్‌ను కలిశారు. వారితో కాలనీకి సంబంధించిన పలు విషయాలపై ముచ్చటించారు. కాలనీకి గత ఏడాది సెప్టెంబరులో బోటులో వచ్చి సందర్శించడం, ఏడాదిలోగా బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన విషయాన్ని కాలనీ వాసులు వివరించి డిప్యూటీ సీఎంతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. గతంలో రాత్రి నిద్రించే సమయంలో వర్షం కురిస్తే ఉదయం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందేవారమని, ఇప్పుడు ఆ బెంగలేదని వీరబాబు చెప్పారు. కాలనీలో ఏడు రోడ్లతో పాటు లింకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, డ్రైన్లు లేవని పవన్ దృష్టికి తీసుకువచ్చారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో రహదారులు, డ్రైన్ల అభివృద్ధికి రూ.10కోట్లు వంతున అంచనాలు రూపొందించి పంపాలని కలెక్టర్ షాన్‌మోహన్‌ను పవన్ ఆదేశించారు. బ్రిడ్జి పనులు చివరి దశలో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని వీరబాబు, ఇతర కాలనీ వాసులు కోరారు. గొల్లప్రోలులో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని విద్యార్థులను పవన్ కలుసుకున్నారు.

'పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి'

కరప, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు సూచించారు. గురువారం ఉదయం ఆయన అరట్లకట్ట గ్రామంలో పర్యటించారు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. సర్పంచ్ గోపి సత్యవేణిగణేష్, పంచాయతీ కార్యదర్శి యడ్ల రాంజీ హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

10 కంప్యూటర్ల వితరణ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌కి ఎస్‌బీఐ 3వ బెటాలియన్ బ్రాంచి మేనేజరు ఆర్.మనస్వి ఆధ్వర్యంలో 10 కంప్యూటర్లను రీజనల్ మేనేజరు ఎంవీవీఎం కృష్ణ చేతుల మీదుగా కమాండెంట్ ఎం.నాగేంద్రరావుకి అందజేశారు. బ్యాంకు యాజమాన్యానికి కమాండెంట్ కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్లు మన్మధరావు, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో ఘనంగా దసరా సంబరం



కరప, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడంలో దసరా సంబరం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. మెరక వీధి, పల్లపు వీధి రామాలయాల కమిటీల నేతృత్వంలో రంగురంగుల విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసిన రథం వాహనాలను రాత్రి తెల్లవార్లు గ్రామమంతా ఊరేగించారు. వాటి ముందు బ్యాండ్‌మేళాలు, కోయ డ్యాన్స్‌లు, డీజే, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేసి సంబరాన్ని రక్తి కట్టించారు. తొలుత ఆయా ఆలయాల వద్ద జ్వాలాతోరణం కనుల పండువగా జరిగింది. పొడవాటి దేవదారు కర్రలతో నిర్మించిన భారీ ఆర్చి నుంచి విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా తీర్చిదిద్దిన రథాలను తీసుకెళ్లి సంబరాన్ని ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చి సంబరాన్ని వీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, నాయకుడు మీసాల రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన తపాలా బిళ్లల ప్రదర్శన


విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి ప్రసాద్

కాకినాడ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యకళా మందిరంలో తపాలా బిళ్లల ప్రదర్శన గురువారం ముగిసింది. పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఔత్సాహికులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ముగింపు కార్యక్రమానికి హాజరైన జేఎన్టీయూకే ఉప కులపతి చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఎప్పుడూ చూడని తపాలా బిళ్లలను చూసి మంత్రముగ్ధుడయ్యానన్నారు. పోస్టల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిలాటలీ) జి.శివనాగరాజు మాట్లాడుతూ ఇలాంటి ఎగ్జిబిషన్లు తరచూ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఫిలాటలీ కళపై అవగాహన కలుగుతుందన్నారు. ఎగ్జిబిషన్‌లో అత్యుత్తమ ప్రదర్శనలను ఎంపికచేసిన న్యాయనిర్ణేతలు అనుష్‌కుమార్ రౌత్, దేవేందర్ కుమార్ జైన్ మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ఈ కళపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఎగ్జిబిషన్‌లో గెలుపొందిన ఫిలాటలిస్టులకు, ఎగ్జిబిషన్ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

కార్యక్రమంలో కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు గంటి రామకృష్ణ, వీవీ రమణమూర్తి, డి.అనిల్‌అంబేద్కర్‌కుమార్, ముదుగు లక్ష్మణ్‌కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు బి.బ్రహ్మంనాయక్, బి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల పాపం వైసీపీ ప్రభుత్వానిదే

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కొత్తపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో రసాయన పరిశ్రమలను స్థాపించి వైసీపీ ప్రభుత్వం పాపం మూటకట్టుకుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఉప్పాడ తీర ప్రాంత సమస్యలపై గురువారం నిర్వ హించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో కేఎస్ ఈజెడ్‌లో కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పట్లో నిర్ణయం తీసుకున్నారన్నారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేవలం కాలుష్య పరిశ్రమలనే ప్రోత్సహించి మత్స్యకారులు తినే అన్నంలో మట్టికొట్టిందని ఆరోపించారు. కాలుష్య, వ్యర్థ జలాలను సముద్రంలోకి వదిలితే మత్స్య సంపద పూర్తిస్థాయిలో అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. మత్స్యకారులకు ఇచ్చిన మాట ప్రకారం డిప్యూటీ సీఎం ఉప్పాడ రావడం శుభపరిణామమని, వారి సమస్యలు 100 రోజుల్లోగా కొలిక్కి వస్తాయని కొండబాబు ధీమాగా చెప్పారు. సభలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అట్లతద్ది నోములు

పెద్దాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో అట్లతద్దిని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం వరకు ఉపవాసం ఉండి చంద్రోదయమయ్యాక మరలా గౌరీమాతను పూజించి అమ్మవారికి అట్లు నైవేద్యంగా సమర్పించారు. కట్టమూరులోని గౌరీదేవి ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం, పట్టణంలో అట్లతద్దిని ఘనంగా జరుపుకున్నారు. నూతన వధువులు ఉదయం నుంచీ ఉపవాసం ఉండి సాయంత్రం గోదావరి పుష్కరిణిల వద్ద గౌరీదేవికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పరస్పరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): అట్లతద్ది సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో యువతులు నోములు జరుపుకున్నారు. తెల్లవారు జామున చద్దన్నం తిని రోజంతా ఉపవాసం ఉన్నారు. నవ వధువులు 12 మంది పేరంటాళ్లకు 12 అట్లు చొప్పున వాయినాలు ఇచ్చారు. పసుపుతో తయారుచేసిన గౌరీదేవిని ఊరి చివర కాలువలో కలిపి నీళ్లలో గౌరమ్మ అంటూ పాటపాడి వ్రతాన్ని పూర్తి చేశారు.

గర్భిణులకు సీమంతం

గండేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో గురువారం జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ముందుగా అంగన్వాడీ టీచర్లు పోషకాలు కలిగిన ఫుడ్‌స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సీడీఎస్ సూపర్‌వైజర్స్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తులసిపాకలో సూపర్ జీఎస్టీ ర్యాలీ

మోతుగూడెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలంలోని తులసిపాక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం సూపర్ జీఎస్టీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్‌మహ్మద్ రఫీ ప్రారంభించారు. హెల్త్ సూపర్ వైజర్లు, స్టాఫ్‌నర్స్, లాబ్‌టెక్నీషియన్, ఫార్మసిస్ట్, హెల్త్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

చింతూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యసంరక్షణరంగంలో జీఎస్టీ తగ్గింపుపై సీహెచ్‌సీ వైద్యుల నేతృత్వంలో గురువారం ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు.వైద్యులు రమణారావు,మహేష్ పాల్గొన్నారు.

జగన్ పర్యటన నేపథ్యంలో విస్తృత తనిఖీలు

రాజవొమ్మంగి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో వైసీపీ అధినేత జగన్ పర్యటన నేపథ్యంలో రాజవొమ్మంగిలో గురువారం పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. రాజవొమ్మంగి మీదుగా వైసీపీ సమావేశానికి వెళ్లే వారికి పోలీసులు సూచనలు జారీ చేశారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మిలను ఎస్‌ఐ శివకుమార్ ఆపి సూచనలు చేశారు. జడ్డంగిలో ఎస్‌ఐ చిన్నబాబు ఆధ్వర్యంలో చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేశారు.

నవోదయలో దరఖాస్తుల స్వీకరణ

ఎటపాక, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశంకోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం విద్యాలయంలో 5 సీట్లు ఖాళీలు ఉన్నాయని చెప్పారు. పదోతరగతిలో 60శాతం మార్కులతో పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని,ఈనెల 13వరకు గడువు ఉందని, 9494343022నెంబరులో సంప్రదించాలని అన్నారు.

వరద నష్టపరిహారం చెల్లించాలి: సీపీఎం

ఎటపాక,అక్టోబరు9(ఆం ధ్రజ్యోతి): ఇటీవల వరుసు గా ఐదుసార్లు వచ్చిన వరదల కారణంగా ముంపు మండలాల ప్రజలు తీవ్రం గా ఇబ్బంది పడ్డారని వారి కి తక్షణమే వరద నష్టపరిహారంచెల్లించాలని సీపీఎం జిల్లా నాయకులు పాయం సీతారామయ్య అన్నారు. కూటూరులో సచివాల యం ముందు గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.40వేలు చెల్లించాలన్నారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులు పక్కాగా నిర్వహించాలి'


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు,కార్యాలయాల్లో రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అన్నారు. మండలంలోని ముసురువిల్లి సచివాలయం, అంగన్‌వాడీకేంద్రం, సబ్‌సెంటర్‌లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాలైన ప్రభుత్వసేవలు ప్రజలకు సకాలంలో అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. పందిరిమామిడి సమీపం లో ఉన్న జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ఏడీఎంహెచ్‌వో డేవిడ్, సీడీపీవో కె.ఉమా, వెలుగు, జీసీసీ అధికారులు పాల్గొన్నారు.

తాటివాడలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

రంపచోడవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటివాడలో గురువారం చెత్త సేకరణ, ఐవీఆర్‌ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించినట్టు జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ ఆస్తుల సంరక్షణ, మంచినీటి సరఫరా, పారిశుధ్యం, ఇంటిపన్ను వసూలు తదితర అంశాలపై వివరించారు. సర్పంచ్‌లు, డీఎల్‌పీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరంలో పర్యటించిన డీఈఈ ఎస్‌కే సైదా

రంపచోడవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎండోమెంట్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.కె.సైదా గురువారం రంపచోడవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ గతంలో ఏజెన్సీ ప్రాంతంలో మంజూరు చేసిన దేవాలయాల నిర్మాణ స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఆయన్ను మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు కలిసి హిందూ దేవాలయాలు లేని గ్రామంలో ఆలయ నిర్మాణాలు ఆదివాసీల సమైక్య నిర్ణయాలతో జరగడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీపీపీ కోఆర్డినేటర్, వీహెచ్‌పీ జిల్లా సత్సంగ ప్రముఖ్ నల్లమిల్లి వేంకట రామారెడ్డి, జిల్లా కార్యదర్శి అన్నవరెడ్డి కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

'మహిళ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి'


ఐద్వా జిల్లా నూతన కమిటీ

చింతూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఐద్వా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి డిమాండ్ చేశారు. చింతూరులో ఐద్వా రంపచోడవరం జిల్లా రెండో మహాసభ గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న రమణి మాట్లాడారు. రోజురోజుకు మహిళలకు రక్షణ కరువైపోతోందన్నారు. పోలవరం నిర్వాసితులకు చట్టపరంగా పరిహారం చెల్లించాలన్నారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో ఐద్వా రాష్ట్ర మహాసభలు అనంతపురంలో జరగనున్నాయన్నారు. ఐద్వా జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షురాలిగా మడవి శ్రీదేవి, కార్యదర్శిగా ఐ.పద్మావతితోపాటు 15మందితో కూడిన కమిటీ ఎన్నికైంది. నాయకులు బొప్పెన కిరణ్, పల్లపు వెంకట్, కారం లక్ష్మి, పొడియం లక్ష్మణ్, రాములమ్మ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలని వినతి


ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):చింతూరులో పంట నష్టం వివరాలు పటిష్టంగా సేకరించి ఆ మేరకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని టీడీపీమండలాధ్యక్షుడు జమాల్‌ఖాన్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన చింతూరు ఐటీడీఏ పీఓ శుభం నొక్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ ఉచితబస్సు సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. అంతరాష్ట్ర బస్సుల పేరిట ఉచిత సౌకర్యం లేకుండా పోతోందని, దీంతో ప్రభుత్వం కల్పించిన సదుపాయం విలీన మండలాల మహిళలకు అందకుండా పోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ జహంగీర్, సాల్మన్‌రాజు, ఎండీ రియాజ్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

త్వరలో జగ్గంపేటలో అన్నక్యాంటీన్ ప్రారంభం

● జ్యోతుల నవీన్


నిర్మాణంలో ఉన్న క్యాంటీన్ పనులను పరిశీలించిన జిల్లా టీడీపీ అధ్యక్షుడు నవీన్

జగ్గంపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పట్టణంలో అతిత్వరలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ముందు గోకవరం రోడ్డులో నిర్మాణంలో ఉన్న అన్నక్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా టీడీపీ నాయకుల, దాతల సహకారంతో అన్నా క్యాంటీన్ ప్రతి సోమవారం ఉచిత అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు.అనంతరం వీరమ్మ చెరువుకు వెళ్లే కాలువకు సంబంధించిన ఏలేశ్వరం రోడ్‌లోని కల్వర్టును నవీన్ పరిశీలించి ఆటో కార్మికులకు స్లాబ్ నిర్మాణం చేసి ఆటో స్టాండ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలియ జేశారు. కార్యక్రమంలో దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, రేఖ బుల్లి రాజు, పిలా మహేష్, మండపాక అప్పన్న దొర, రాయి సాయి, అల్లు అంజిబాబు, కుంచె శ్రీను, డీఈ ఉమాశంకర్, జేఈ నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవి పూజలు

గండేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):అట్లతద్ది సందర్భంగా గురువారం మండలంలో సందడిగా మారింది. తెలుగుతనం ఉట్టిపడేలా తెలుగింటి ఆడపడుచులు సాంప్రదాయ దుస్తులు ధరించి గ్రామ సమీపంలో ఉన్న ఆలయాల్లో పూజ నిర్వహించి అలాగే గౌరీదేవి అమ్మవారికి వాయినాలు సమర్పించి సాయంత్రం గ్రామ సమీపంలోఉన్న పుష్కరగట్టు వద్ద దీపాలువెలిగించారు వాయినాలు తీర్చుకున్నారు.

అడబాలకు పలువురి పరామర్శ

జగ్గంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు తండ్రి రామవరం గ్రామ సీనియర్ టీడీపీ నాయకుడు అడబాల మునలయ్య (చంటి) అనారోగ్యంతో కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ అక్టోబర్ 7న మృతి చెందారు. అడబాల వెంకటేశ్వరరావును పలువురు పరామర్శించారు. గురువారం కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, గండేపల్లి వైస్ ఎంపీపీ కుంచే రాజా, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కోర్పు సాయితేజ, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, కొత్త భైరవకృష్ణ, క్లస్టర్ ఇన్చార్జి పైడిపాల సూరిబాబు, భూపాలపట్నం ప్రసాద్, కాకినాడ జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ ఉండవల్లి వీర్రాజు, తిరుమల రాజు, మురళిరాజు, జగ్గంపేట మండలం అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ శివ, అడ్వకేట్ దంతులూరి కృష్ణంరాజు, డ్రిల్ మాస్టర్ శ్రీను, తదితరులు అడబాల చంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బర్రే కోటేశ్వరరావు ఆదర్శప్రాయుడు

ప్రత్తిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యా బోధన చేస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా మన్ననలు అందుకున్న ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బర్రే కోటేశ్వరరావు ఆదర్శప్రాయులని మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ముక్కు సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు. ప్రత్తిపాడులోని బర్రే నివాసం వద్ద గురువారం సంతాప సభ నిర్వహించారు. కోటేశ్వరరావు చిత్రపటానికి సుబ్రహ్మణ్యం పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు.ఈ విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు చుక్కల సత్యనారాయణ, బీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన టీడీపీ నాయకులు


ఎమ్మెల్యే జ్యోతులను కలిసిన మల్లిశాల టీడీపీ నాయకులు

జగ్గంపేటరూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాక శివకేశుల ఆలయంవద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మల్లిసాల క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకు లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులు పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముండ్రు ఎర్రబాబు, సర్వసిద్ధ లక్ష్మణ్, తొట్టిపూడి నాగేశ్వరరావు, కనవరెడ్డి రామకృష్ణ, సియాదులా పెద్దకాపు పాల్గొన్నారు

ఎమ్మెల్యే సత్యప్రభకు రుణపడి ఉంటా

● వెన్నా శివ


ఎమ్మెల్యే సత్యప్రభకు బొకే అందజేస్తున్న వెన్నాశివ

ప్రత్తిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు జీవితాంతం రుణపడి ఉంటానని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ చెప్పారు. నూతనంగా కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన శివ గురువారం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపేందుకు కత్తిపూడి నుంచి మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి భారీ గజమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజవర్గంలో పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్న వెన్నా శివ మరింత ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పర్వత సురేష్, బద్ది రామారావు, జ్యోతుల శ్రీనివాస్, కీర్తి సుభాష్, గాబు కృష్ణమూర్తి, వీర్ల సూరిబాబు, బొమ్మిడి సత్యనారాయణ, రాజాల చిట్టిబాబు, సాధనాల లక్ష్మీబాబు, కొయ్యారమణ, గాబు శివ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజల్లో సంతోషం

ప్రత్తిపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజల్లో సంతోషం నెలకొందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలో గురువారం ఆమె ఇంటింటా తిరిగి మహిళలకు జీఎస్టీ అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ సడలింపు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పలు రకాల ఎలక్ట్రానిక్‌వస్తువుల ధరలు తగ్గాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో లంపకలోవ సొసైటీ అధ్యక్షుడు వరుపుల రామకృష్ణ, టీడీపీ నాయకులు యాళ్ళ జగదీష్, అంబటి రాంబాబు, వెలుగుల నాని, జువ్విన తిరుపతిరావు, దోశే నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

జగ్గంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎమ్ పూర్ణిమ ఆధ్వర్యంలో రాజపూడి సెక్టార్ సూపర్ వైజర్ ఎస్.అమ్మాజీ పర్యవేక్షణలో బాలికాదినోత్సవం సందర్భంగా సచివాలయం పరిధిలో ఉన్న కిశోర బాలికలకు చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్, లింగ వివక్షత, సైబర్ సేఫ్టీ, రుతుస్రావంలో ఎదుర్కొనే రుగ్మతలు, రక్త హీనత, బాల్య వివాహాలు గురించి ఏదో ఒక టాపిక్స్‌పై కిశోర బాలికలకు వ్యాసరచన పోటీ రా జపూడి హైస్కూల్ హెడ్‌మాస్టారు కె.సుబ్బారావు సమక్షం లో నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులకు ఎంపికచేశారు.

'ఆదిత్య' అధ్యాపకురాలికి డాక్టరేట్



గండేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):మండలంలో సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్న నిషా కుమారికి గీతం (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) విశాఖపట్నం వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారని ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్. రవి తంగజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతం విశ్వ విద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ. బంగారాజు పర్యవేక్షణలో నిషాకుమారి సమర్పించిన గ్రంథానికి రూరల్ మైక్రో- ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అండ్ మైగ్రేషన్ స్టడీ ఫ్రమ్ ది ప్రిజం ఆఫ్ ఎంజీఎన్ఆర్ఈజీఏ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అందుకున్నారని తెలిపారు. ఛాన్సలర్ డాక్టర్.ఎన్.శేషారెడ్డి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్. ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్.ఎం.శ్రీనివాస్‌రెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు.

విచ్చలవిడిగా పురుగు మందులు వాడొద్దు

● ఏవో అమృత

ప్రత్తిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో విచ్చలవిడిగా పురుగుమందులు వాడవద్దని మండల వ్యవసాయాధికారి జోకా అమృత సూచించారు. మండలంలోని రాచపల్లి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు సందర్శించి రైతులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులతో పాటు, కషాయాలు, జీవామృతాలు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'మాజీ సర్పంచ్ మృతి తీరనిలోటు'

ప్రత్తిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం గ్రామ మాజీ సర్పంచ్ అటికే సత్యవతి మృతి చెందడం పార్టీకి తీరని లోటని నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు. రోడ్డుప్రమాదంలో అటికే సత్యవతి మృతి చెందిన నేపథ్యంలో గురువారం శరభవరం విచ్చేసి మాజీ సర్పంచ్ భర్త సత్యనారాయణను, కుటుంబ సభ్యులను గిరిబాబు పరామర్శించి ఓదార్చారు.

కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ

ఏలేశ్వరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలను సరిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీరుకొండ సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారం పట్టణం వీధుల్లో గురువారం సుమారు 350 మందికి కరపత్రాలు పంచి సంతకాలు సేకరించారు. దర్నాల కోట శ్రీను, మలిరెడ్డి మధుబాబు, చక్రరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కుంబాభిషేకం

శంఖవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాశబరిమలైగా విరాజిల్లుతున్న సిద్దివారి పాలెం అయ్యప్ప క్షేత్రంలో స్వామివారి మహాకుంబాభిషేక మహోత్సవ వేడుక వైభవంగా జరిగింది. ఆలయ వంశపారంపర్య చైర్మెన్ కుసుమంచి సత్యశ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమైంది. స్వామివారిని ఊరేగింపుచేసి, విఘ్నేశ్వరపూజ, మండపారాధనలతో అనేక పూజలు నిర్వహించారు.


మాట్లాడుతున్న సురేష్ తదితరులు

రోడ్డు పనులకు నిధులు మంజూరుపై హర్షం

శంఖవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీ ఉదయ్‌భాస్కర్ చొరవతో శంఖవరం నుంచి రౌతులపూడి రోడ్డుకు మహర్దశ పట్టనుందని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన నివాసంలో టీడీపీ నేతలు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ శంఖవరం నుంచి రౌతులపూడి రహదారికి 3.5 కోట్ల నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యే సత్యప్రభ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధిపరిచేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బద్ది మణిరామారావు, వెన్నా శివ, పార్టీ మండల అధ్యక్షుడు ఈగల త్రిమూర్తులు, పోలం చిన్నా, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

లోవలో హుండీల ఆదాయం లెక్కింపు

తుని రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కింపును గురువారం అధికారులు చేపట్టారు. ఆలయంలోని హుండీలను తెరిచి దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. ఈ హుండీల ద్వారా 72 రోజులకు రూ.49,25,015 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి విశ్వనాథ్ రాజు తెలిపారు. ఈ లెక్కింపులో దేవదాయ శాఖ అధికారులు కె.నాగేశ్వరరావు, వి.ఫణీంద్రకుమార్ పర్యవేక్షించగా దేవస్థానం సిబ్బంది, శ్రీవారి సేవకులు, నాయీ బ్రాహ్మణులు, చైతన్య గోదావరి బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


ఏలేశ్వరం జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటినిల్వలు

ఏలేరులో పెరుగుతున్న నీటినిల్వలు

ఏలేశ్వరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న గోదావరి జలాలతోపాటు వరద నీరు చేరడంతో ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగున్నాయి. పురుషోత్తపట్నం నుంచి 875 క్యూసెక్కుల చొప్పున నీరు జలాశయంలోకి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా గురువారం 20.41 టీఎంసీలకు నీటి నిల్వలు చేరాయి. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం 84.70 మీటర్లకు చేరింది. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ


తుని ఏరియా ఆసుపత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రౌతులపూడి, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి సీహెచ్‌సీ డీడీవో ఉమామహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో వైద్య బృందం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవ్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సునీత, స్వాత్విక్, డైరెక్టర్ బండారు సత్తిబాబు, మాజీ చైర్మన్ కైశర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): కోటనందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్‌పీడీవో వెంకట నారాయణ మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీతో ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యామిని, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ టి మాధవి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్ సాధ్యమని తుని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అవగాహన కల్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో తుని ప్రభుత్వాసుపత్రిలో అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ తట్టపర్తి రాజా, పూడి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ చైర్మన్‌గా సూర్యప్రకాష్


ఎమ్మెల్యే దివ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న సూర్య ప్రకాష్

తొండంగి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ కమిటీ) చైర్మన్‌గా తొండంగి మండలం పీఈ చిన్నాయిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత నరహరిశెట్టి సూర్యప్రకాష్‌ను ప్రభుత్వం నియమించింది. తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల పరిధిలో వ్యవసాయ శాఖ కార్యకలాపాలను ఈయన పర్యవేక్షించనున్నారు. 26 మంది సభ్యులున్న కమిటీకి ఈయన చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన ఎమ్మెల్యే దివ్యకు, టీడీపీ సీనియర్ నేత రాజేష్‌లను ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈయనకు పదవి లభించడం పట్ల టీడీపీ సీనియర్ నేత తుని మండల టీడీపీ అధ్యక్షులు చింతంనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్ , ఇనుగంటి సత్యన్నారాయణ, వడ్డి రాంబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

డిప్యూటీ సీఎం పవన్‌కు ఎమ్మెల్యే వినతి

తుని రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రసాయన వ్యర్థాల వల్ల మత్స్యసంపదకు ముప్పు ఏర్పడిందని ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకునేలా చొరవ చూపాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే దివ్య కోరారు. కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన మత్స్యకారుల మాటామంతి కార్యక్రమంలో దివ్య మాట్లాడారు. తొండంగి తీర ప్రాంతంలో రోజుకు 2వేల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని ఆమె వివరించారు. ఏడాదికి రూ.3లక్షల నుంచి 4 లక్షల వరకు మత్స్యకారులు సంపాదించుకుంటున్నారని తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

తుని రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారిచే నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో టి.జ్యోతిర్మయి, హ్యాండ్‌బాల్, టి.కళానిధి, స్కేటింగ్, హ్యాండ్‌బాల్, అండర్-14 విభాగంలో ఎస్.మేఘన రాష్ట్రస్థాయిలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తెలిపారు. ప్రతిభ కనబరిచిన రాష్ట్రస్థాయి పోటీలకు అధినేత సీహెచ్ విజయప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు బి.సీతారాణి, కోచ్ సురేష్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

కృష్ణాలయం నిర్మాణానికి సహకరించాలి

శంఖవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి పాత కొత్తూరులో కృష్ణాలయ నిర్మాణానికి సహకరించాలని నేతలు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను కోరారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వెన్నా శివ, కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణ, కేశంగి జనార్థన్, బీసీ నేతలు కొయ్యా రమణ, అమజాల వెంకటరమణ, అమజాల రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


తాడు సాయంతో రైతులను కాలువ దాటించిన పోలీసులు

రైతులను రక్షించిన పోలీసులు

రౌతులపూడి, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన 15 మంది రైతులు ఏటికాలువ ఉధృతికి పొలాల్లో చిక్కుకున్నారు. ఇది తెలుసుకున్న తుని ఫైర్, రౌతులపూడి పోలీసులు వారిని రక్షించారు. రౌతులపూడి మండలం ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన రైతులు కొప్పర్తి ముసలియ్య, గొంప వరహాలు, పల్లే గణేష్ తదితర 13 మంది రైతులు బుధవారం పొలం పనులకు వెళ్లారు. తిరిగి వస్తుండగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి అన్నవరం పంపాకు నీరు వచ్చే ఏటికాలువ ఉధృతంగా ప్రవహించడంతో వారు పొలాల్లో ఉండిపోయారు. రాత్రి ఎనిమిది అయినప్పటికి ఏరు ఉధృతి తగ్గలేదు. దీంతో గ్రామంలోని టీడీపీ నేత ఈగల సత్తిబాబుకు వారు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు ఫోన్‌లో రైతుల సమస్యను చెప్పగా, తక్షణమే స్పందించి పోలీసులకు ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో తుని అగ్నిమాపకశాఖతో పాటు, రౌతులపూడి పోలీసులు ఏటికాలువ వద్దకు చేరుకుని రెండు గంటలపాటు శ్రమించి తాడు సహాయంతో 13 మందిని కాలువ దాటించారు. పోలీసులకు కే.గోవిందు, జి.రాము సహకారాలు అందించారు.